ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025
5
తూర్పుగోదావరి

ప్రతినిధులతో నిండిపోయిన సభా ప్రాంగణంలో ఒక భాగం

శాస్త్రీయమైన విద్యను అందించాలి

- పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ లక్ష్మణరావు
- ఘనంగా ప్రారంభమైన యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ
- రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది హాజరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ కాకినాడలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులతో ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. పలువురు ప్రముఖులు, అధికార పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు సైతం హాజరై అమూల్యమైన సందేశాలు ఇచ్చారు. ప్రజానాట్యమండలి కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేమన స్కిట్‌కు మంచి స్పందన వచ్చింది

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

అందరికీ న్యాయమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలని, ఇది ప్రభుత్వ విద్యారంగం ద్వారా మాత్రమే సాధ్యమని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ ఆదివారం కాకినాడ పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సభలకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి సుమారు 20వేల మంది ప్రతినిధులు తరలి వచ్చారు. తొలుత సీనియర్ నాయకులు కె.సత్తిరాజు జాతీయ పతాకాన్ని, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు ఆవిష్కరించారు. ఈ మహాసభకు సూచికగా 17 పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగంలో సామాజిక న్యాయాన్ని కాపాడడానికి కృషి చేయాలన్నారు. గ్రామానికి ఒక ప్రాథమిక పాఠశాల, ఐదు తరగతి గదులు, ఐదుగురు ఉపాధ్యాయులతో ఉండాలన్నారు. విద్యారంగం పట్ల ఒక సమగ్రమైన విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలన్నారు.

ఎంఎల్‌సిలు ఐవి, గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల అందరి ఐక్యత కోరేది యుటిఎఫ్ అన్నారు. నేడు కేంద్రం, రాష్ట్రంలో పాలన రాజ్యాంగ బద్ధంగా జరగట్లేదన్నారు. పెద్ద సంఘంగా ఉన్న యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా సామాజిక బాధ్యతగా పలు కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజ్యాంగ హక్కుల రక్షణకు అందరూ పోరాడాలన్నారు. ఆహ్వాన సంఘం ఛైర్మన్, ఎన్‌టిఆర్ యూనివర్సిటీ మాజీ విసి డాక్టర్ ఐవి.రావు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక కేంద్రంగా వర్ధిల్లుతున్న కాకినాడ నగరం అందరికీ స్వాగతం పలుకుతుందన్నారు. మాజీ ఎంఎల్‌సి వి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నిలదీస్తూ విద్యారంగాన్ని కాపాడుతున్న సంఘం యుటిఎఫ్ అని కొనియాడారు.

రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్రంలోనే చాలా బలమైన సంఘంగా ఉందన్నారు. మహాసభ జరుపుకుంటున్న సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. తమ తల్లిదండ్రులు యుటిఎఫ్ సభ్యులుగా ఉండేవారని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను 20 ఏళ్ల పాటు ఐఎఎస్‌గా సేవలు అందించానని గుర్తు చేసుకున్నారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ జగన్ ప్రభుత్వం డ్రాపౌట్స్ పెంచిందని, అనేక స్కూల్స్ మూతపడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని మెరుగుపడేదే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి తనకు ఎంతో ఇష్టమన్నారు. గౌరవప్రదమైన వృత్తిని సాగిస్తూనే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ కృషి చేయడం అభినందనీయమన్నారు.

సభకు అధ్యక్షత వహించిన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెప్పుపాటి ఆశయ సాధనకు ముందడుగు వేసుకుంటూ కోసం నిరంతరం యుటిఎఫ్ పనిచేస్తుందన్నారు. ఎర్రజెండా అంటే పాలకులకు వణుకు పుడుతుందన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను ఆయన వివరించారు.

ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సిఎన్.భారతి మాట్లాడుతూ ఎన్ఇపికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఒపిఎస్ సాధించేవరకూ ఒకే తాటిపై నిలబడి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రవి, ఎ.వెంకట్ ఎపిటిఎఫ్(1938) రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, ఎపి యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ సీనియర్ నాయకుడు కె.సత్తిరాజు

ప్రజానాట్యమండలి కళాకారుల వేమన కళారూపం

సాబ్జీ జీవిత చరిత్రపై రాసిన 'నా పయనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సిలు

నాయకులు గీతాలాపన

సిఎన్.భారతి ఎపిటిఎఫ్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి

బొర్రా గోపిమూర్తి పిడిఎఫ్ ఎంఎల్‌సి

ఐ.వెంకటేశ్వరరావు పిడిఎఫ్ ఎంఎల్‌సి

ఐ.వెంకటేశ్వరరావు పిడిఎఫ్ ఎంఎల్‌సి



కర్రి పద్మశ్రీ, ఎంఎల్‌సి

రాపాక వరప్రసాదరావు ఎంఎల్ఎ, రాజోలు

విఠపు బాలసుబ్రహ్మణ్యం మాజీ ఎంఎల్‌సి

ఎన్.వెంకటేశ్వర్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉత్సాహంగా సాగిన సదస్సులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభలో భాగంగా ప్రాంగణంలో గురువారం ప్రజాచైతన్య సదస్సు, ఉద్యమ సదస్సులు ఆలోచింపజేశాయి. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రజా చైతన్య సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి ముఖ్యవక్తగా పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌సి విల్సన్, పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి, కాకినాడ డిఇఓ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సిలు ఐవి, కెఎస్.లక్ష్మణరావు, గోపిమూర్తి తదితరులు పాల్గొన్నారు. పాలకుల విధానాల వల్ల కేంద్ర, రాష్ట్రాలలోని విద్యావ్యవస్థలో వచ్చిన పోకడలను రమాదేవి వివరించారు. ప్రయివేటీకరణ వల్ల విద్యారంగం నాశనమైన తీరును విశదీకరించారు. వీటిపై పోరాడాలని దీనికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. విల్సన్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థ మొత్తం తన చెప్పు చేతల్లో పెట్టుకుని రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం ఎన్ఇపిని తీసుకొచ్చిందన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలు ఎక్కువ అవ్వడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించుకోవాలని సూచించారు. డివైఇఒ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక విద్యారంగాన్ని పరిరక్షించు కోవాలన్నారు. అనంతరం జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాకుళం జిల్లాకు చెందిన హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరావును పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఘనంగా సత్కరించారు.

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకురాలు రమాదేవి

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉద్యమ సదస్సులో యుటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కె.జోజయ్య ప్రారంభోపన్యాసం చేశారు. సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు, పి.బాబురెడ్డి, కమలాకుమారి, రమణయ్య శాస్త్రి, న్యాయవాది అప్పారి సత్యప్రసాద్ మాట్లాడారు. యుటిఎఫ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తితో ఎన్నో అద్భుతాలు సాధించొచ్చన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలన్నారు.

ఉద్యమ సదస్సులో మాజీ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ భార్య షేక్ బేగం మాట్లాడారు. తామ కుటుంబమంతా ఉపాధ్యాయులమేనని తెలిపారు. 34 ఏళ్ల పాటు సాబ్జీ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రమాదవశాత్తు కర్తవ్యం నిర్వహణలో మరణించడం తమ కుటుంబానికి తీరని లోటు అన్నారు. సాబ్జీ అందరి మనసుల్లో ఉంటారని ఆశిస్తున్నాను. సాబ్జి జీవిత చరిత్రపై రాసిన 'నా పయనం' పుస్తకాన్ని ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి, గోపి మూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు తదితరులు ఆవిష్కరించారు.

నేడు నల్లజర్ల పిజిఆర్ఎస్‌లో కలెక్టర్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్, నల్లజర్ల

ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా నల్లజర్ల మండలం ఎంపిడిఒ కార్యాలయం నుంచి తాను పాల్గొంటున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అందరు జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని ఆదేశించారు. డివిజన్ మండల స్థాయి అధికారులు ఆయా ప్రధాన కేంద్రం నుంచి హాజరవ్వాలని ఆదేశించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు జిల్లా కలక్టరేట్‌కు వస్తున్నారని, అదే సమయంలో మండల కేంద్రంలో తక్కువ అర్జీలు వస్తున్నాయని తెలిపారు. నల్లజర్ల మండలం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

సంక్రాంతికి కోడిపందేలు, జూదాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

కోడి పందేలు, జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి డి.నరసింహ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు లోనవకుండా వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు కోడిపందేలపై, ఇతర నిషేధిత క్రీడలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు.

కార్టూ'నిజం'



రోడ్లను పరిశీలించిన ఎంఎల్ఎ ముప్పిడి

ప్రజాశక్తి-చాగల్లు

పంచాయతీరాజ్ ద్వారా మంజూరైన రూ.8 కోట్ల నిధులతో నిర్మిస్తున్న చాగల్లు జుట్ట వారి వీధి చివర నుంచి లక్ష్మీపురం సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు, గతంలో 2014 నుంచి 2019 ఆర్ అండ్ బి రోడ్లు, సిసి రోడ్లను గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టామని, 2019-24 వరకు కేవలం బటన్ నొక్కడమే తప్ప గ్రామాభివద్ధి లేదని తెలిపారు. తమ ప్రభుత్వం ఆర్థిక నిధులు ఇబ్బందు ఉన్నప్పటికీ నిడదవోలు, పంగిడి రోడ్ల గోతులు పూడుస్తున్నామని భవిష్యత్తులో కొత్త రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. గ్రామాల్లో సిసి రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టిడిపి నాయకులు నాదల శ్రీరామ్ చౌదరి, మాజీ ఎంపిపి కేతాసాహెబ్, టిడిపి పట్టణ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ, అల్తాఫ్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

మహాసభకు తరలిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చాగల్లు, నల్లజర్ల

కాకినాడలో నిర్వహిస్తున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలకు చాగల్లు మండలం నుంచి 20 మంది యుటిఎఫ్ నాయకులు తరలి వెళ్లారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు రవి వర్మ, కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో వారు పయనమయ్యారు.

నల్లజర్ల మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో మహాసభలకు తరలి వెళ్లారు. సీనియర్ కార్యకర్త పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ఎం.ఆలీసాహెబ్ యుటిఎఫ్ జెండాను ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అధ్యక్షుడు ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి బి.కిషోర్, జిల్లా కార్యదర్శి ఎన్.భవాని, జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్ఎస్.మనోహర్ కుమార్ పాల్గొన్నారు.

నల్లజెర్లలో బస్సు యాత్ర ప్రారంభిస్తున్న ఆలీసాహెబ్

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో చింతామోహన్ మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణ, ఇరిగేషన్ ప్రాజెక్టులు (కాలేశ్వరం, పోలవరం) ఇవిఎంలు, బ్యాంకు రుణాలపై మాట్లాడేందు వచ్చానని ఆయన తెలిపారు. ఒకప్పుడు ఎస్‌సిలు అంటరానివారుగా ఉండేవారుగా 5000 సంవత్సరాలు కష్టాలు, కన్నీళ్ళతో అన్నీ చూశారన్నారు. కాంగ్రెస్ పార్టీ, మహాత్మా గాంధీ కృషి వల్ల అంటరానివారు ఎస్‌సిలయ్యారని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్ట్ ఇచ్చిన జడ్జిమెంట్ ఒక ఫ్రాడ్ అన్నారు. భారత రాజ్యాంగ విరుద్ధంగా ఏడుగురు జడ్జీలు తీర్పు ఇచ్చారని, అసలు ఆ జడ్జీలకు అంటరానితనమంటే తెలీదన్నారు. 35 మంది జడ్జీల్లో ఒక్కరు కూడా ఎస్‌సి కాలనీల్లో తిరగలేదన్నారు. ఎపిలో చంద్రబాబు ఎస్‌సిలను విభజించి పాలించాలని అనుకుంటున్నారని, 55 రోజులు చంద్రబాబు జైల్లో ఉంటే తాను రాజమహేంద్రవరం వచ్చి తీవ్రంగా ఖండించినట్టు తెలిపారు. జైలు నుంచి బయటకొచ్చి, ఆయన చేయాల్సింది ఇదేనా అని ప్రశ్నించారు. పోలవరంపై ప్రతిరోజూ అంచనాలు పెంచుకుంటూ పోతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు రూ.50 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. రాజకీయ నాయకులు పోలవరంపై డబ్బు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఇవిఎంలను ట్యాంపరింగ్ చేసి బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. జనసేన పార్టీలో కాపు, కమ్మ వాళ్లకే మంత్రి పదవులు ఇచ్చారని, సామాజిక న్యాయం పాటించలేదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

స్వర్ణాంధ్ర సేవలకు 27 వసంతాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరి తీరాన రాజమహేంద్రవరంలో అనాథలు, అభాగ్యులను అక్కున చేర్చుకుని ఆసరాగా నిలుస్తున్న స్వర్ణాంధ్ర సేవా సంస్థ సోమవారం 27 వసంతాలకు చేరువ అయ్యింది. వార్షికోత్సవం నిర్వహించేందుకు సంస్థ నిర్వాహకుడు, సేవాతత్పరుడు డాక్టర్ గుబ్బల రాంబాబు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ 27 ఏళ్లుగా సుమారు 18 లక్షల మంది వివిధ రకాలుగా స్వర్ణాంధ్ర సంస్థ ద్వారా లబ్ధి పొందడం ఎంతో గొప్ప విషయం. వృద్ధులు, ఒంటరి జీవులకు, నిరాశ్రయులకు ఆశ్రయం, అన్నార్తుల వద్దకు వెళ్ళి అన్నదానం, మహిళలకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ, రోడ్డు పక్కన ఎండలో మలమలమాడే చిరు వ్యాపారులకు గొడుగులు అందజేత, వికలాంగులు, వృద్ధులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్ల అందజేత, ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా కొన్ని వేలమందికి స్వచ్ఛంద సేవలో వాలంటీర్ ఇంటర్న్‌షిప్ చేయించిన ఘనత నిర్వాహకులు గుబ్బల రాంబాబుకు దక్కుతుంది. మహిళలకు టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గం కోర్సుల్లో శిక్షణ ఇప్పించి వారు స్వయం ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందేలా చేయడం స్వర్ణాంధ్ర సేవా సంస్థ తన బాధ్యతగా భావిస్తోంది. ఇప్పటికే వేలమంది మహిళలు ఈ సంస్థ ద్వారా శిక్షణపొంది స్వయం ఉపాధి పొందగలిగారు. ఐదేళ్ళుగా పుష్కరఘాట్, ప్రభుత్వాసుపత్రి వద్ద ఉచిత మొబైల్ అన్నదానం నిరాటంకంగా సాగుతోంది. సుమారు వెయ్యికి పైబడి ఉచిత వైద్య శిబిరాలు, సుమారు 100కు పైబడి రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ నిరాశ్రయులను చేరదీసి వారిలో మానసిక పరివర్తన కలుగచేసి తిరిగి ఇళ్లకు పంపించే ప్రయత్నం తమ సంస్థ నిరంతరం చేస్తున్నట్టు తెలిపారు. ఇళ్లలోని వృద్ధులను నిర్లక్ష్యం చేయక వారిని ప్రేమతో చూడాలని సూచించారు. కని పెంచి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేసిన తలిదండ్రులను ఎప్పుడూ భారంగా పిల్లలు, మనవలు చూడరాదని తెలిపారు. నగరంలో దాతలు, వదాన్యుల సహకారం సంస్థకు ఎప్పుడూ ఉంటోందని రాంబాబు తెలిపారు.

స్వర్ణాంధ్ర సేవాసంస్థ (ఇన్‌సెట్‌లో నిర్వాహకుడు రాంబాబు)

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిజియు చాన్సలర్ చైతన్య రాజు

8, 9 తేదీల్లో ప్రపంచ తెలుగు మహాసభలు

ప్రజాశక్తి-రాజానగరం

ఈ నెల 8, 9 తేదీల్లో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు)లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్టు చైతన్య విద్యా సంస్థల చైర్మన్, ఛాన్సలర్ కెవివి.సత్యనారాయణ రాజు (శ్రీ చైతన్య రాజు) తెలిపారు. గైట్ కళాశాలలో తెలుగు మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాసభలు 8న ఉదయం 9 గంటలకు ప్రారంభమై ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వివిధ సాహిత్య ప్రక్రియలు ఉంటాయన్నారు. దీనికి విశిష్ట అతిథులుగా భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, భారత పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ, ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, న్యాయమూర్తులు, ప్రముఖ సినీ నటులు, రచయితలు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిజియు విసి డాక్టర్ ఉదయగిరి చంద్రశేఖర్ ఉన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ 35వ వార్షికోత్సవం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 35వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలో మూడున్నర దశాబ్దాలుగా అత్యంత నైపుణ్యం కలిగిన విద్యను అందిస్తూ అతితక్కువ ఫీజులతో నిర్వహిస్తూ విద్యార్థులకు ఉత్తమ బోధనలు అందించడమే లక్ష్యంగా క్రమశిక్షణ విద్యా నైపుణ్యాలు పెంపొందించడం, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించి సామాజిక బాధ్యతల స్పృహ కల్పిస్తూ వివిధ రంగాల్లో ఉన్నతులుగా విద్యార్థులను తీర్చిదిద్ది సమాజానికి అందించడం సెయింట్ జోసెఫ్ స్కూల్ యొక్క ఘనత అని ఎంఎల్ఎ ప్రశంసించారు. విద్యార్థుల, తల్లితండ్రులు పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాథ్యూస్, సెల్వన్ లాజర్, సిస్టర్ అనీస్, డివైఇఒ రామన్నదొర, టిడిపి నాయకులు పెన్మెత్స సుబ్బరాజు, గ్రామ సర్పంచ్ బొంతా భరత్ బాబు, ఎంఇఒలు తిరుమలదాస్ అప్పారావు, స్కూల్ కరస్పాండెంట్ సాజీ థామస్, ప్రిన్సిపల్ సిస్టర్ ఎల్సి పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-కడియం

పోటీ పరీక్షలలో విజేతలుగా నిలవాలంటే విషయ పరిజ్ఞానంతో పాటు ఒత్తిడిని అధిగమించే సత్తా ఉండాలని ఎన్నారై అకాడమీ సిఇఒ వి.తులసీరామ్ అన్నారు. ఆదివారం స్థానిక గిరజాల కృష్ణప్రసాద్ కల్యాణ మండపంలో రాజమహేంద్ర వరం ఎన్ఆర్ఐ అకాడమీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలు నిర్వమించరాఉ. జెఇఇ (ఐఐటి), ఎన్ఇఇటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అకాడమీకి చెందిన సీనియర్ అధ్యాపకులు, రాష్ట్రస్థాయి జోనల్ ప్రిన్సిపల్ పాల్గొని, పరీక్షా విధానం, నెగిటివ్ మార్కులు, జాతీయస్థాయి ర్యాంకింగ్, సీట్లు కేటాయించే విధానం తదితర విషయాలను వివరించారు. మయుక్తా స్కిల్ సెంటర్ డైరెక్టర్ ఆచంట అనురాధ పదో తరగతి పరీక్షలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అకాడమీ ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మురారి ఫారెస్ట్ ఏరియాలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. దీనికి సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు చిట్టిబాబు, ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి : మండలంలోని లచ్చిడిపాలెంలో ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వామి, తుని ఎక్సైజ్ ఎస్ఐ శాస్త్రి, సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 140 లీటర్ల నాటు సారాను, 225 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం గ్రామ శివారు వెంకీయ్యమ్మ చెరువు సమీపంలో ఉన్న పశువుల పాక ఆదివారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన గొల్లు నానాజీ ఆదివారం సాయంత్రం పశువులను కట్టి ఇంటికి వచ్చారు. అనంతరం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సివుంది. ఈ ప్రమాదంలో గృహ అవసరాలకు ఉపయోగించే సామాగ్రితో పాటు ఎడ్ల బండి, సైకిల్, డ్రమ్ములు దగ్ధమయ్యాయి.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పెద్దాపురం పట్టణానికి చెందిన కొత్త విశ్వజిత్ సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆశాధులు, వేద పండితులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

పబ్లిక్ వాకింగ్‌కి ప్రవేశం కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రంగరాయ మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో పబ్లిక్ వాకింగ్‌కి ప్రవేశం కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. ఆర్ఎంసిలోకి ప్రవేశం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా వాకర్స్‌కు నిర్ధిష్ట వేళల ప్రకారం ప్రవేశం కల్పించే అవకాశాన్ని పెద్ద మనస్సుతో అంగీకరించాలన్నారు. ఆధార్ కార్డు, ఐడెంటిటీ కార్డు గుర్తింపుతో నగర పౌరులకు ఆర్ఎంసి మైదానానికి ప్రవేశ అర్హత కల్పించాలని కోరారు.

6న మరిడమ్మ పుట్టింటికి గరగల పయనం

ప్రజాశక్తి - పెద్దాపురం

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఈనెల 6న మరిడమ్మ గరగలు పుట్టినిల్లు అయిన సామర్లకోటలోని చింతపల్లి ఇంటికి పయనం అవుతాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ప్రతిరూపంగా గరగలకు పాన్పు వేసి పూజలు చేస్తారన్నారు. ఆ రోజు ఉదయం 8:40 గంటలకు పెద్దాపురం మరిడమ్మ ఆలయం నుంచి బయలుదేరి డప్పుల దరువుల మధ్య గరగల నృత్యాలతో వెళతాయని అన్నారు.

రేషన్ షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో చౌకు ధరల దుకాణ డీలర్ల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తహశీల్దారు డి.అచ్యుత కుమారి తెలిపారు. లంకమాలపల్లి (ఓసి) ఎంవి.పాలెం (బిసి-ఎ మహిళ) కడింపాడు (ఎస్ఇ-మహిళ) పెరవలి (బిసి-బి మహిళ) పెరవలి (ఒసి) ముక్కామల (ఎస్‌సి మహిళ) రేషన్ డీలర్లు షాపులు శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. 18 ఏళ్ల వయసు నుంచి 40 ఏళ్ల లోపు ఉండి, కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉన్న వారు దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు తహశీల్దారు కార్యాలయం లేదా సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - నిడదవోలు

గణపతి సెంటర్లో రోడ్డు మరమ్మతు పనులను మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మి తదితరులు ఆదివారం పరిశీలించారుర. వారి వెంట కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, ఎండి షాకీరా బేగం, ముంగండి మాణిక్యమాల, చిలకల శారదాదేవి, మానుపాటి లక్ష్మి, జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి కొవ్వాడ బాలు, కార్యదర్శి నగినబోయిన నాగరాజు, సంయుక్త కార్యదర్శి అచ్యుత పవన్, జనసేన నాయకులు ఎండి ఫయాజ్, గంగుల గోపి, మద్దిపాటి ఫణీంద్ర, కృపానందం పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

ప్రజాశక్తి - నిడదవోలు

తిమ్మరాజుపాలెంలోని పద్మావతి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఎపి కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవంలో పేద కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. జనసేన పార్టీ నిడదవోలు టౌన్ అధ్యక్షుడు రంగ రమేష్, నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

విఆర్ఒల సంఘం కార్యదర్శిగా సొంగరాజు

ప్రజాశక్తి-పెరవలి

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెరవలి విఆర్ఓ సొంగారాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం గ్రామ కచేరిలో ఆదివారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా గ్రామ రెవెన్యూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీందర్ రాజు పాల్గొన్నారు. వారి సమక్షంలో అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఆసుపత్రులపై చర్యలు

డిఎం హెచ్‌ఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణలో పారదర్శకత, నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి తనిఖీల నేపథ్యంలో ఆయన వివరాలను ప్రజాశక్తికి వెల్లడించారు.

జిల్లాలో తనిఖీలు ఎలా కొనసాగుతాయి

ఆసుపత్రులు 2007 నిబంధనల ప్రకారం అనివార్యంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇది లేకుండా సేవలను అందించడం చట్ట విరుద్ధం. రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకుండా సేవలను అందించరాదు. ఆసుపత్రులు రోగుల నుంచి అధిక రుసుములు వసూలు చేయడం మరియు ఆసుపత్రి నిబంధనలను ఉల్లంఘించేవారిపై చర్యల నిమిత్తం జిల్లాలో మూడు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాము. 50 నుంచి 100 పడకల్లోపు ఆసుపత్రులను డిఎంహెచ్‌ఒ నేతృత్వంలోనూ, 50 పడకల లోపు ఆసుపత్రులను కొవ్వూరు డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సంధ్యారాణి నేతృత్వంలోనూ, ల్యాబ్స్ స్కానింగ్ సెంటర్లు, రాజమండ్రి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.సుధాకర్ నేతృత్వంలో తనిఖీలు జరుగుతున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఎటువంటి చర్యలు

రోగుల సేవలకు సంబంధించిన ప్రతి అంశంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఆసుపత్రులపై ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు, పెద్ద మొత్తంలో జరిమానా విధింపు, సంబంధిత వారిపై ఫిర్యాదులు నమోదు చేయడం, వంటి చర్యలు తీసుకుంటాము. ఆసుపత్రి భవనం విధిగా ఫైర్ సేఫ్టీ, రోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం అవసరమైన పార్కింగ్ స్థలం అందుబాటులో ఉండాలని భౌతిక అవసరాలను తీర్చే విధంగా మానవ వనరుల అభివృద్ధి శాఖ మార్గదర్శకాల ప్రకారం ఉండాలని, అంబులెన్స్‌లు, అత్యవసర వాహనాల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని తెలిపారు. ఇబ్బందులు ఎదురైతే వైద్య ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేయొచ్చు

ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి సేవలు పొందుతున్న ప్రజలు తమ హక్కులను తెలుసుకుని, ఏదైనా అన్యాయం జరిగితే సంబంధిత అధికారులను లేదా హెల్త్ డిపార్ట్మెంట్‌ను సంప్రదించాలి .ప్రతి ఆసుపత్రిని సమీక్షించి అవసరమైన చోట చర్యలు తీసుకోబడతాయి. ఆసుపత్రుల సేవలను మరింత మెరుగుపరచి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలి. అన్నిరకాల పరీక్షలను నిర్వహించగల సామర్థ్యం కలిగిన ల్యాబొరేటరీ తప్పనిసరిఅని, బయోకెమికల్ పరీక్షలు నాణ్యమైన ప్రమాణాలతో జరగాలని. లాబ్ టెక్నీషియన్లు గుర్తింపు పొందిన అర్హతలు కలిగి ఉండాలని, ఆసుపత్రికి అనుబంధంగా నడిచే ఫార్మసీ సేవలు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ ప్రకారం నిర్వహించాలని రోగులకు మందుల ధరలపై పారదర్శకత పాటించాలి

ఆసుపత్రుల్లో పరిశుభ్రత పరిస్థితి ఏమిటి

ప్రతి ఆసుపత్రిలో రోగుల ఆరోగ్యాన్ని కాపాడటంలో పరిశుభ్రత అత్యంత కీలకం. ప్రతి ఆసుపత్రిలో శుభ్రత పాటించే విధంగా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఆదేశించాము. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం నిర్వహించాలని, రోగులకు, వారి కుటుంబ సభ్యులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, అన్ని విభాగాల్లో అర్హత కలిగిన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఉండాలని, డాక్టర్లకు అవసరమైన నైపుణ్యాల సర్టిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఆసుపత్రి సేవల ధరలను స్పష్టంగా బోర్డులపై ప్రదర్శించాలని, రోగుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పురుషోత్తంపట్నం పథకం రైతులకు వరం

ప్రజాశక్తి - పిఠాపురం

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పిఠాపురం నియోజకవర్గ రైతులకు ఒక వరం లాంటిదని మాజీ ఎంఎల్ఎ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎస్.వర్మ అన్నారు. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం ప్రారంభించి 8 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆదివారం సిఎం చంద్రబాబు, వర్మ చిత్రపటాలకు స్థానిక రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ టిడిపి, రైతులు కలిసి చేసిన పది సంవత్సరాలు అలుపెరగని పోరాటంతోనే పురుషోత్తపట్నం వచ్చిందన్నారు. ఈ పోరాటంలో చంద్రబాబునాయుడు మూడు సార్లు పాల్గొన్నారని, లక్ష సంతకాల ఉద్యమంలో లక్ష సంతకం పెట్టడానికి చంద్రబాబు నాయుడు వచ్చారన్నారు. రైతులు ఆక్రందన, నీరు లేక ఎండిపోవడం, వరదలు వచ్చి మునిగిపోవడం, రైతులు నష్టపోవడం ఆయన గుండెల్లో పాతుకుపోయిందని, ముఖ్యమంత్రి అయ్యాక... పురుషోత్తపట్నం ప్రాజెక్ట్ తీసుకువచ్చారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో పురుషోత్తపట్నం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. ఏలేరు ఫేస్ 2 ఆధునీకరణ పనుల ప్రారంభించాలని చంద్రబాబును కోరానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్స్, మాజీ జడ్‌పిటిసి కౌన్సిలర్స్, నీటి సంఘాల ఛైర్మన్లు, డిసి ఛైర్మన్లు, టిసి మెంబర్స్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

స్విమ్మర్ గోలి శ్యామలకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - సామర్లకోట

విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు సాహసంగా ఈది ఘనతను సాధించిన పట్టణానికి చెందిన గోలి శ్యామల అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఛరవాణి ద్వారా ఆమెతో మాట్లాడి అభినందనలు తెలిపారు. సాహస కృత్యాలకి వయసుతో సంబంధం లేదని గోలి శ్యామల నిరూపించారని, భవిష్యత్‌లో ఆమె మరిన్ని సాహస యాత్రలు కొనసాగించాలని దత్తాత్రేయ ఆకాంక్షించారు. అలాగే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ తదితరులు శ్యామలను ట్విట్టర్, ఎక్స్ వేదికల ద్వారా అభినందించారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సంక్రాంతి పండగ పురస్కరించుకుని నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహారం కిట్లతోపాటు దుస్తులు, వారి తల్లులకు చీరలు పంపిణీ జరిగింది. ఆదివారం మీ సేవ స్వచ్ఛంద సంస్థ (ఎస్ఎంఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు పడాల శ్రీనివాస్ రెడ్డి, గీతావాణి ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ పేదల జీవితంలో వెలుగులు నింపాలన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే విద్యార్థులకు దుస్తులను సంక్రాంతి కానుకగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ ఛాయా అవార్డు గ్రహీత సలాది కృష్ణ, సోర్నపూడి సోమేశ్వరరావు, ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, బేరి రాంబాబు, జాజిమొగ్గల జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నీటి పక్షుల గణనలో ఆదిత్య వాలంటీర్లు

ప్రజాశక్తి - కాకినాడ

కోరంగి వన్య ప్రాణుల అభయారణ్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో చేపట్టిన నీటి పక్షుల గణనలో ఆదిత్య ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఇ వి ఎల్ . నా య ు డ ు తెలిపారు. ఈ గణనలో అనేక రకాల వలస పక్షులను, ప్రత్యేక జాతులను గుర్తించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ ప్రశంసా పత్రాలను అందించి అభినందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, గౌరీప్రియలను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

అటవీ శాఖ అధికారులతో ఆదిత్య ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పాఠశాలలో వేదిక నిర్మించిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక మంగా యమ్మరావుపేటలో ఉన్న ఆంధ్ర కేసరి ప్రకాశం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1978-79 10వ తరగతి పూర్వ విద్యార్థులు 2 లక్షలతో వేదిక నిర్మించారు. ఆదివారం సదరు వేదికను తమకు పాఠాలు చెప్పిన గురువు కృష్ణమూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మాస్టారును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము చదివిన పాఠశాలకు ఏదైనా చేయాలనే సంకల్పంతో రూ. 2 లక్షల రూపాయలు పైగా సమీకరించి వేదికను నిర్మించమన్నారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఎస్‌పిఎల్ కామరాజు, సూరారెడ్డి, యాతం గంగారావు, బచ్చల సంజీవ్, బాదం శ్రీను, డాక్టర్ రవి, చిట్టిబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పరిధిలో బైక్ మెకానిక్స్ యూనియన్ సభ్యులకి ట్రాఫిక్ నిబంధనలపై ఆవాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు మాట్లాడుతూ బైక్‌లు నడిపే ప్రతీ ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలాగే బైక్ మెకానిక్ షెడ్ వద్దకు ఎవరైనా అనుమానస్పదంగా బైకులు తీసుకువస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బైక్ మెకానిక్ యూనియన్ యజమానులు, హెల్పర్లు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ తోటకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం

మాజీ ఎంఎల్ఎ తోట గోపాలకృష్ణకి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం స్థానిక సుధా కాలనీలో ఆయన కుమారుడు తోట సుబ్బారావు నాయుడు స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా గోపాలకృష్ణ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి వాసు, పెద్దిరెడ్డి సతీష్, ప్రిన్స్ ఆలీ, గోకేడ మణి, సంజయ్ పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ -సామర్లకోట కెనాల్ రోడ్ మరమ్మతులు సందర్భంగా 5 రోజులు వాహనాల రాకపోకలు దారి మళ్లింపు చేస్తున్నట్లు ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 11 తేది వరకూ పనులు జరుగుతాయని తెలిపారు. కాకినాడ కెనాల్ రోడ్ లో ప్రయాణించే వాహనాలను భానుగుడి జంక్షన్, సర్పవరం, అచ్చంపేట, ఉండూరు మీదుగా సామర్లకోటకు మళ్లించినట్లు తెలిపారు. అదేవిధంగా సామర్లకోట నుంచి కాకినాడ వచ్చే వాహనదారులు ఉండూరు, అచ్చంపేట జంక్షన్, సర్పవరం జంక్షన్ మీదుగా కాకినాడకు మళ్లించినట్లు తెలిపారు. ఈ ట్రాఫిక్ డైవర్షన్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు.

ప్లాస్టిక్‌పై అవగాహనా కార్యక్రమం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫోరెన్సిక్ సైన్స్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని ఆనూరు గ్రామంలో ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్‌ను తగ్గించండి, భూమిని రక్షించండి అనే నినాదంతో గ్రామస్తులకు వస్త్రాలతో తయారు చేసిన సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ విలాస్‌అనిల్ చవాన్, వైస్ ప్రిన్సిపల్ పివి.నాగేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ పిఒ బి.విద్యాసాగర్, సిబ్బంది ప్రతినిధి అమీష్ పాల్గొన్నారు. విద్యార్థులు, గ్రామస్తుల ర్యాలీ నిర్వహించారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీనివాస్

జూదాల నిర్వహణ చట్ట రీత్యా నేరం

ప్రజాశక్తి - పిఠాపురం

సంక్రాంతి సందర్భంగా జూదాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలో ఎఫ్‌కె పాలెం గ్రామ కూడలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి సమయంలో కోడిపందాలు, గుండాట, పేకాట ఆడడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పమన్నారు. పండుగను ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజలు, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఎస్ఐ సత్యనారాయణ

జూదాలు వద్దు.. క్రీడలే ముద్దు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సంక్రాంతి సందర్భంగా జూదం, కోడిపందాలు వద్దని, క్రీడలే ముద్దని కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కోరంగిలో వాలీబాల్ పోటీలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొనగా, విజేతలకు బహుమతులను అందించారు. జూద క్రీడలు చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు.

చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న తలాటం ప్రకాశరావు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక ఆనంద నిలయం విద్యార్థులకు సామాజిక సేవకులు తలాటం ప్రకాశరావు నూతన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 8 ఏళ్లుగా తన సతీమణి రాజామణి, తల్లి వెంకటేశ్వరమ్మ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆనంద నిలయంలో చిన్నారులకు నూతన వస్త్రాలు ఇచ్చి, ఒకరోజు భోజనం సమకూర్చడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తలాటం ప్రకాశరావును జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవల కోటేశ్వరరావు, పబ్బినీడి ఏసుబాబు, పెద్దిరెడ్డి బాబి, కాట్రు వీరేశ్వరరావు, ఆనంద నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఫోటో:టి ఎల్ వి.01 ఆనంద నిలయం విద్యార్థులకు నూతన వస్త్రాలు అందిస్తున్న ప్రకాశరావు తదితరులు..

7న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని పుట్టినరోజు సందర్భంగా నాని యూత్ ఆధ్వర్యంలో ఈనెల 7న పాత హైస్కూల్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నాని యూత్ సభ్యుడు రాగాల హరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో జరిగే ఈ శిబిరం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. డాక్టర్లు బివి.జగదీష్ బాబు, బి.అనిల్ నందన్, కె.రుక్మిణి, కె.సంజన వైద్య సేవలందిస్తారని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. పెద్దాపురం కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం, పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యానాం వార్తలు

అందంగా తీర్చిదిద్దిన ఫల పుష్ప ప్రదర్శన ముఖద్వారం

ప్రజా ఉత్సవాలకు యానాం సిద్ధం

- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు

ప్రజాశక్తి - యానాం

నూతన సంవత్సరంలో సంక్రాంతి కంటే ముందుగానే నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పుదుచ్చేరి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 21వ యానాం ప్రజా ఉత్సవాలు, 23వ ఫల పుష్ప ప్రదర్శన సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి చేసిన ఏర్పాట్లును ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు విలేకరుల సమావేశంలో వివరించారు. స్థానిక జిఎంసి బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి వేదికను ఇప్పటికే సిద్ధం చేశారు. దానికి ఎదురుగా ఫల పుష్ప ప్రదర్శనకు సంబంధించి ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దారు. వివిధ రకాల పూల మొక్కలను ఉంచడానికి స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రజా ఉత్సవాలలో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులచే సంగీత, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫల పుష్ప ప్రదర్శనలో బెంగళూరు, పూణే, కడియం నుంచి తెచ్చిన వివిధ రకాల పుష్పాలు పండ్లు, కాయగూరలు ప్రజలను ఎంతో ఆకర్షించనున్నాయి. సోమవారం ముఖ్యమంత్రి రంగస్వామి చేతుల మీదుగా ప్రజా ఉత్సవాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి గవర్నర్‌తోపాటు, మంత్రులు, ఎంఎల్ఎలు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ప్రజా ఉత్సవాలకు యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సభాధ్యక్షులుగా వ్యవహరించాల్సివుంది. అయితే మల్లాడి కృష్ణారావు పాల్గొనే కార్యక్రమాల్లో తాను పాల్గొనేది లేదని ఇప్పటికే ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్ ప్రకటించారు. గత ఏడాది జరిగిన ప్రజా ఉత్సవాలకు ఆయన హాజరు కాలేదు. దీనిపై మల్లాడి కృష్ణారావు మీడియా సమావేశంలో సెటైర్లు వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఫల పుష్ప ప్రదర్శనను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి

యానాం చేరుకున్న వ్యవసాయ శాఖ మంత్రి

పుదుచ్చేరి వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి తేనె జై కుమార్ ఆదివారం యానాం చేరుకున్నారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, వ్యవసాయ శాఖ డిడి శివ సుబ్రహ్మణ్యన్, ఎస్‌పి రాజశేఖరన్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించే 21వ ప్రజా ఉత్సవాలు, 23వ ఫల పుష్ప ప్రదర్శనలో ఏర్పాటుచేసిన వివిధ రకాల జాతుల మొక్కలను అలాగే ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

చెల్లిరామ్‌ను అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

చెల్లిరామ్‌కు స్వామినేని-త్రిపురనేని అవార్డు

ప్రజాశక్తి - యానాం

స్వామినేని-త్రిపురనేని ఇంటిగ్రల్ హ్యూమనిస్ట్ అవార్డును యానాంకు చెందిన ప్రముఖ కవి చెల్లిరామ్ అందుకున్నారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం హైస్కూల్లో జరిగిన సభలో రామ్‌కు అవార్డును ప్రధానం చేశారు. ఐ.పోలవరంకు చెందిన పుల్లేపు తాతాయ్య మెమోరియల్ అసోసియేషన్(పిటిఎం)17వ వార్షికోత్సవంను పురష్కరించుకుని యానాం అంబేద్కర్ నగర్‌కు చెందిన చెల్లిరామ్‌కు స్వామినేని - త్రిపురనేని ఇంటిగ్రల్ హ్యూమనిస్ట్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రశంశా పత్రం, మెమెంటో అందించి ఘనంగా సత్కరించి, అభినందించారు. పిటిఎం సంస్థ ఆర్గనైజింగ్ ఛీఫ్ పుల్లెపు వెంకటేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
EP No.1/2011
OS No. 345/2005

Between :
శ్రీ గంగిన వెంకట సత్యన్నారాయణ
S/o రంగారావు @పెదరంగారావు, హిందు
R/o కాతేరు - DHR
మరియు
1) మారెడ్డి జగ్గారావు (Died)
2) మారెడ్డి అనిల్ కుమార్
తండ్రి లేటు జగ్గారావు, హిందు, భీమోలు గ్రామం, గోపాలపురం మండలం
3) తోట శైలజ, భర్త తోట రామచంద్రుడు, హిందు, పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం
-JDr లు

నోటీసు

పై నెంబరు EP గ్రంధములో డిక్రీబాకీ వసూలు నిమిత్తం JDr లకు చెందిన EP షెడ్యూలు ఆస్తిని పై శ్రీకోర్టు వారు ది. 20-1-2025 సం॥ తేదీన పై కోర్టులో ఉదయం 10.30 ని॥లగాయితు వేలం వేయుదురని, ఆసక్తి కలవారు పాల్గొని పాడుకొనవచ్చునని, అందు యావత్తు సమాచారము శ్రీ కోర్టువారి నజారత్ ఆఫీసు నుండి గాని, DHr న్యాయవాది వారి ఆఫీసు నుండి కాని తెలుసుకోవచ్చునని యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

వేలం యిస్తిహారు దాఖలా షెడ్యూలు ఆస్తి వివరం

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, వేగేశ్వరపురం, సబ్-రిజిష్ట్రారు వారి ఆఫీసులో చేరిన, భీమోలు గ్రామ పంచాయితీ, భీమోలు గ్రామం తాలూకు, 2 మరియు 3 JDr లు స్వాధీన, హక్కు భక్తములో వున్న జిరాయితీ మెరక JDr దాఖలా ఎ. 2-50 సెంట్లలో అవిభాగపు వాటా (Undivided Share) ఎ. 1-50 సెంట్లు భూమికి హద్దులు :
తూర్పు : ఎ. అచ్చయ్య భూమి, దక్షిణం : పుంత, పడమర : పుంత, ఉత్తరం : మారెడ్డి త్రిపుర భూమి.

యీ హద్దుల మధ్యస్తమైన ఎ.2.50 సెంట్లు భూమిలో అవిభాగపు వాటా (Undivided Share) ఎ. 1-50 సెంట్లు భూమి యావత్తు యీజిమెంటు హక్కులతో సహా.

D.Hr. విలువ : రూ. 1,25,000/-
Amin విలువ : రూ. 24,00,000/-
S.R.O. విలువ : రూ. 16,50,000/-
J.Dr. విలువ : శ్రీ కోర్టువారికి J.Dr. విలువ తెలియపర్చియుండలేదు.

శ్రీ కోర్టు వారి అనుమతితో
శ్రీ Ch. వెంకటేశ్వరరావు
శ్రీ S. సుబ్బారావు
D.Hr తరుపు అడ్వకేట్లు
కొవ్వూరు

కొవ్వూరు
2-1-2025